
# కొడుకు పెళ్లి

## డా. తంగిరాల మీరాసుబ్రహ్మణ్యం




ముసురు పట్టి వాతావరణం చల్లగా ఉంది. నల్ల మబ్బులు గుంపులుగా వచ్చి మూగడంతో సాయంత్రం నాలుగు గంటలకే చీకటి పడినట్టు తయారయింది. అయిదు గంటలయ్యేసరికి సన్నగా చినుకులు మొదలయ్యాయి.

అకాల వర్షం. ఎక్కడో వచ్చి పడిన అల్ప పీడనం ప్రభావం. వాన రాకడ ప్రాణం పోకడ చెప్పలేమని అననే అన్నారు పెద్దలు.

ఇంటి ముందు వసారాలో పడక కుర్చీలో వెనక్కి వాలి కూర్చున్న పశుపతి అశాంతిగా కదిలాడు.

"అదేమిటండీ దీపం వెలిగించకుండా చీకటిలో కూర్చున్నారు. జల్లు కూడా కొడుతోంది. తడిసిపోతారు లోపలికి పదండి" అంటూ వచ్చి వసారాలో లైటు వేసింది అతని భార్య దాక్షాయణి.


పశుపతి పలకలేదు. ఆవిడ మాటలు చెవిన పడనట్టు మిన్నకున్నాడు.

"ఊరి నుండి వచ్చినప్పటి నుండి అలా నీరసంగా, నలతగా కనబడుతున్నారు. జ్వరంగానీ వచ్చిందా?" అంటూ దగ్గరగా వచ్చి నుదుటి మీద చేయి వేసి చూసింది.

"నాకేమీ రాలేదు. ఊరికే విసిగించక నన్ను ఒంటరిగా వదిలేయి కాసేపు" చిరాకుగా అన్నాడు పశుపతి.

మాట్లాడకుండా లోపలికి వెళ్లిపోయింది దాక్షాయణి. ఈ దంపతుల పేర్లు విన్న కొత్త వాళ్లు భలేగా కుదిరాయి అనక మానరు. దానికి తగినట్టే వారిది అనుకూల దాంపత్యం. పిత్రార్జితంగా వచ్చిన యాభై ఎకరాల తరిపొలం, పల్లెలో డాబా ఇల్లు, పట్నంలో రెండు ఇళ్ల స్థలాలు. ఇవికాక చేతిలో మంచి ఆదాయం వచ్చే ఉద్యోగం. ముచ్చటగా ముగ్గురు పిల్లలు. ఒక రకంగా పశుపతి జీవితం వడ్డించిన విస్తరి వంటిదే.

పెద్దవాడు సురేష్ కంప్యూటర్ ఇంజనీరింగు డిగ్రీ తీసుకుని పిట్స్‌బర్గ్ కార్నెగీ యూనివర్సిటీలో ఎం.ఎస్. చేస్తున్నాడు. రెండో కూతురు శర్మద బయో కెమిస్ట్రీలో డిగ్రీ చేస్తోంది. మూడో అమ్మాయి శర్మిష్ఠ హోమ్‌సైన్స్ డిగ్రీ చదువుతోంది.



"నాన్నా! ఈ మాత్ర వేసుకుని కాఫీ తాగమంది అమ్మ" అంటూ జ్వరం మాత్ర, కాఫీ గ్లాసు అందించింది శర్మద.

మాట్లాడకుండా మాత్ర వేసుకుని కాఫీ తాగాడు. చామనఛాయలో ఉన్న ఇరవై ఏళ్ల శర్మద చక్కని శరీర సౌష్టవంతో, ఆకర్షణీయమైన కను ముక్కు తీరుతో ఆకట్టుకునేట్టు ఉంటుంది.


'శర్మదకు పెళ్లి సంబంధాలు చూడ్డం మొదలుపెట్టాలి' అనుకున్నాడు పశుపతి. ఆడపిల్లలిద్దరికి పి.జి. డిగ్రీ చేతికి వచ్చాకే పెళ్లి మాట తలపెట్టాలని అనుకునేవాడు. ఆడపిల్లలు చదువుకుని, తమ కాళ్ల మీద తాము నిలబడగలమన్న ధైర్యం కలవారై ఉండాలని అతని భావన. అటువంటిది హఠాత్తుగా తన ఆలోచనలో మార్పు రావడానికి కారణం అనుకోకుండా పడిన చెన్నై ప్రయాణం.

అసహనంగా కదలి నుదురు రుద్దుకున్నాడాయన. తనకి ఇంకో అయిదేళ్ల సర్వీసు మిగిలి ఉంది. ఆడపిల్లలు ఇద్దరికీ పెళ్లిళ్లు చేసేస్తే బాధ్యతలు తీరినట్టే.

"భోజనానికి రండి" దాక్షాయణి పిలుపు.

"నాకు తినాలని లేదు. మీరు తినేయండి" అన్నాడు కళ్లు మూసుకుని.

"మీరిద్దరూ అన్నాలు తినేసి గిన్నెలు మూతలు పెట్టి వెళ్లండి" అని కూతుళ్లకి చెప్పి వసా





రాలోకి వచ్చింది దాక్షాయణి.

పశుపతికెందుకో పిచ్చి కోపమొచ్చింది. "అంటే నువ్వు భోజనం మానేస్తున్నావు.. అంతేనా? రేప్పొద్దున్న నేను పోయాక ఏం చేస్తావు? జీవితాంతం ఉపవాసాలుంటావా?" కసురుతున్నట్టుగా అన్నాడు పశుపతి.

దాక్షాయణి అశుభం మాటలు సహించలేనట్టు చెంపలు వేసుకుని, పుస్తెలు కళ్లకద్దుకుంది.

"ఎందుకలా మనసు నొప్పిస్తారు? మీరు తినకుండా నేను ఎప్పుడైనా తిన్నానా?" అంది గద్గదికంగా.

"పొద్దున్న రైలు దిగినప్పటి నుండి మీరు మామూలుగా లేరు. ఏం జరిగిందో చెప్పకపోతే నాకెలా తెలుస్తుంది?" కాస్త తేరుకుని లాలనగా అడిగింది.

"ఏదో ఆఫీను గొడవలు. కాసిని వేడి పాలు తెచ్చిచ్చి పడుకో వెళ్లి" అన్నాడాయన నెమ్మదించి.

"అన్నట్టు నిన్న మీరు ఊళ్లో లేనప్పుడు మీ చెల్లెలు కాత్యాయని ఫోను చేసింది" గుర్తొచ్చి చెప్పింది భార్య.

"ఎందుకట?" చిరాగ్గా అడిగాడు. ఆవిడకు ఆశ్చర్యం కలిగింది. ఒక్కగానొక్క చెల్లెలు కాత్యాయని అంటే ఎక్కడలేని ఆపేక్ష అతనికి.

"అదే సురేష్ చదువైపోయి ఇండియాకు వస్తున్నాడుగా వచ్చే వారం. ఇంకేముంటుంది? అందరం అనుకుంటున్నదే... తన కూతురు రమ్య పెళ్లి మన అబ్బాయితో నిశ్చయం చేసుకోడానికే. వాడు రాకముందే వచ్చి మనతో మాట్లాడి పెట్టుపోతలు, ఇచ్చిపుచ్చుకోవడాలు అనుకోడానికేమో" అన్నది దాక్షాయణి.

గభాలున పడక కుర్చీలో నుండి లేచాడు పశుపతి. "ఎవరికి వాళ్లు ఏదో అనుకుని నిర్ణయాలు తీసేసుకోవడమేనా? ఏదో చిన్నప్పుడు సరదాగా అనుకుంటే అది నిశ్చయమైనట్టే ఊహించుకుంటే దాని ఖర్మ" అన్నాడు విసురుగా.

దాక్షాయణికి నోట మాట రాలేదు. కాత్యాయని కూతురు రమ్య పున్నమిచంద్రుని లాటి పిల్ల. వంక పెట్టడానికి వీలు లేని అందంతో బాటు చదువు సంస్కారం ఉన్న పిల్ల. పైకి గట్టిగా అనుకోకపోయినా పై సంబంధాలు చూసే ఉద్దేశ్యం అన్నా చెల్లెళ్లిద్దరికీ ఇన్నాళ్లూ లేదు.

## రియా సేన్ ఆనందం

బెంగాలీ బ్యూటీ రియాసేన్ మోడలింగ్, హిందీ సినిమాల్లో నటిస్తూ తన పుట్టిన ఊరు కోలకతాని ఎంతగానో మిస్సవుతుంటుందిట. అయితే ఇటీవల ఆమె రీతూపర్ణ ఘోష్ దర్శకత్వంలో ఓ బెంగాలీ సినిమాలో నటించింది. ఈ సినిమా గురించి కంటిన్యూగా కొన్నాళ్లు కోలకతాలోనే వుంది రియా. తనకిష్టమైన కోలకతాలో షూటింగ్ పుణ్యమాని కొన్నాళ్లు గడిపినందుకు తెగ ఆనందపడిపోతోంది రియా! కాదా మరి!

"ఎన్నాళ్లుగానో మన వాడి మీద ఆశ పెట్టుకుంది మీ చెల్లెలు. ఇప్పుడు మీరు ఏ కారణం లేకుండా కాదంటే మనసు కష్టపెట్టుకుంటుంది. ఈ ఇంటి ఆడపడుచుని కన్నీరు పెట్టించడం శుభం కాదు. పైగా సురేష్‌కు రమ్యకు కూడా మనసు ఒకరి పట్ల ఒకరికి అభిమానం ఉంది" నెమ్మదిగా నచ్చజెప్పాలని చూసింది దాక్షాయణి.

"కారణం లేదని ఎవరన్నారు? మేనరికాలు మంచివి కావని ఈమధ్యన అందరు డాక్టర్లూ అంటున్నారు. చూశావుగా మీ అన్న కొడుకుకి మీ అక్కకూతుర్ని ఇచ్చి చేస్తే వాళ్లకు పుట్టిన పిల్లలు ఇద్దరిలో ఒకరు మూగ, మరొకడు మందమతి. నీ కొడుకు పిల్లలు అలాగే ఉండాలనుకుంటున్నావా? పైగా వాడు మంచి ఉద్యోగంలో చేరి నాలుగు రాళ్లు వెనకేసుకునే దాకా పెళ్లి లంపటంలో దింపను. అన్నాళ్లు ఆ పిల్లకు పెళ్లి చేయకుండా అట్టి పెడుతుందా? రమ్య చెల్లెళ్లిద్దరున్నారు వెనకాల. నువ్వు ఈ విషయంలో కల్పించుకోకు. నేను రేపు కచ్చితంగా చెప్పేస్తాను కాత్యాయనితో" నిక్కచ్చిగా చెప్పి వెళ్లి పడుకున్నాడు పశుపతి.

పొద్దున్నే ఎనిమిది గంటలకు సురేష్ నుండి ఫోను వచ్చింది. అప్పుడు పిట్స్‌బర్గ్‌లో పదకొండు గంటలయి ఉంటుంది రాత్రి అనుకుంటూ ఫోను తీశాడు పశుపతి.

"నీకిప్పుడు ఇరవై మూడేళ్లు. కనీసమంటే ఆరేడు సంవత్సరాల దాకా నీ పెళ్లి గురించి ఆలోచించే పని లేదని అనుకుంటున్నా. మీ పెద్దమ్మ కూతురికి మేన

రికం చేస్తే ఎలాటి పిల్లలు పుట్టారో చూశాక కూడా నువ్వు రమ్య మీద ఆశ పెట్టుకునేంత బుద్ధిహీనుడవని అనుకోను. ఏమంటావు?" తన మనసులో మాట సూటిగా కొడుకుకు చెప్పేశాడాయన.

"ఆ విషయాలు ఇప్పుడు ఫోన్లో ఎందుకు నాన్నా?" అన్నాడు సురేష్.

"రేపు మీ అత్తయ్యకు నీ మీద ఆశలు పెట్టుకోవద్దని చెప్పేస్తున్నాను. అందుకు.. నాకు అయిదారేళ్లు సమయం ఇవ్వరా! ఈలోగా శర్మద, శర్మిష్ఠల పెళ్లి చేసేస్తాను. ఆ తరువాత నువ్వెప్పుడు పెళ్లి చేసుకున్నా అభ్యంతరం చెప్పను" అన్నాడు పశుపతి.

దాక్షాయణికేమీ అర్థం కావడం లేదు. కొడుకు సంపాదనలో ఒక డాలరు కూడా ఆశించే మనిషి కాదు భర్త. తమకున్న దానిలో పిల్లల పెళ్లి ఘనంగా చేయగలరు. ఆడపిల్లల పెళ్లిళ్లు అయ్యేదాకా కొడుకు పెళ్లి ఎందుకు వాయిదా వేస్తున్నాడో ఆమెకు అగమ్య గోచరంగా ఉంది.


ఫోను చేయడానికి బదులు స్వయంగా బయల్దేరి వచ్చిన కాత్యాయని అన్నగారు ఖరాఖండీగా తన మనసులో మాట చెప్పేసరికి తట్టుకోలేక పోయింది.

"అన్నయ్యా..కొడుకు విదేశాలకు వెళ్లి చదువుకుని స్థిరపడేసరికి నీకు కట్నకానుకల మీద ఆశ పెరిగినట్టుంది. డబ్బుకు మొహం చూసుకోకు. ఇంత కావాలని అడుగు ఏమీ అనుకోం. అంతేగానీ సైన్సు, వంకాయ అంటూ సాకులు చెప్పకు" అంది నిష్ఠూరంగా.

"నీ అన్న డబ్బు మనిషని నీకు అనిపించడం నా దురదృష్టం. నేను సురేష్ పెళ్లికి కాణీ కట్నం తీసుకున్ననాడు ఆ మాట అను. రమ్యకు మంచి సంబంధం చూసి నేనే పెళ్లి జరిపిస్తాను. నేనెందుకిలా చేశానన్నది ఇప్పుడు నీకు అర్థం కాకపోయినా ఎప్పుడో ఒక రోజు గ్రహిస్తావు" అని సంభాషణ ముగించాడు పశుపతి.

"నా కూతురి పెళ్లి చేయడానికి నీ దయాధర్మాల మీద ఆధారపడే స్థితిలో లేములే అన్నయ్యా" అనేసి వెళ్లిపోయింది కాత్యాయని.

వారం తరువాత ఇండియా వచ్చిన సురేష్‌కు తల్లి ద్వారా ఈ వివరాలన్నీ తెలిశాయి. ఏమీ జరగనట్టే ఊరికి వెళ్లి మేనత్తనూ, రమ్యనూ పలుకరించి వచ్చాడు. మూడు వారాల తరువాత ఉద్యోగంలో చేరడానికి వెళ్లిపోయాడు సురేష్.





శర్మద డిగ్రీ పరీక్షలు రాయగానే మంచి సంబంధం తీసుకు వచ్చి కూతురి పెళ్లి జరిపించాడు పశుపతి. మరో రెండేళ్లకి శర్మిష్ఠకు కూడా పెళ్లి చేసేశాడు. చెల్లెళ్ల పెళ్లికి వారం రోజులు సెలవు మీద వచ్చి వెళ్లిపోయాడు సురేష్.

కాత్యాయని అన్నగారి మీద పంతానికి రమ్యకు విదేశాలలో ఉన్న వరుడిని వెదికి, కుదిర్చి, పెళ్లి చేసి పంపింది.

పశుపతి ఉద్యోగం నుండి రిటైరయ్యాడు.

"ఇదిగో అదిగో అంటూ వాడికి ఇరవై తొమ్మిదేళ్లు వచ్చాయి. ఇకనైనా ఒక మంచి సంబంధం చూసి పెళ్లి చేస్తారా?" అని సాధించడం మొదలుపెట్టింది దాక్షాయణి.




భార్యవైపు నిర్వేదంగా చూశాడు పశుపతి. "అలాగే చూద్దాం.. వాడికెలాటి పిల్ల కావాలో కనుక్కో. నా బాధ్యతలు తీరిపోయాయి. ఇక వాడి పెళ్లి జరిపించేయి" అన్నాడాయన వేదాంత ధోరణిలో.

"అదిగో.. మళ్లీ ఆ విరుపులెందుకు? జరిపిద్దాము అనకుండా జరిపించేయి అనడంలోనే మీ ఉద్దేశం అర్థమవుతూంది. దేశం కాని దేశంలో ఉన్న పిల్లాడు ఏ ఆకర్షణకు లొంగిపోతాడో అని భయపడి చిన్న వయసులోనే పెళ్లి చేసే తండ్రులను చూశాం గానీ ముప్పై ఏళ్ల ముదురు బ్రహ్మచారిగా తయారైన కొడుకు పెళ్లి గురించి మీలాగ పట్టించుకోని తండ్రి మాత్రం ఉండదు" అన్నదావిడ ఉక్రోషంతో.

ఈ ఆరేళ్లలో భర్త ధోరణిలో మార్పు ఆమెకు మనస్తాపాన్ని కలిగిస్తోంది. ఇదివరకటిలా ఇంట్లో జరిగే ప్రతీ విషయం మీద శ్రద్ధ పెట్టడం మానేశాడు. కూతుళ్లతోనే కాదు భార్యతో కూడా ముభావంగా అంటీముట్టనట్టు ఉంటున్నాడు. అలాగని వాళ్లకు ఏ లోటూ రానివ్వడం లేదు. గుళ్లూ గోపురాలు తిరగడం, పురాణ ప్రవచనాలు వినడం అంటే సరిపోని మనిషి ఈ అయిదారేళ్లలో బోలెడు పుణ్యక్షేత్రాలు తిరిగాడు భార్యా పిల్లలతో సహా. రిటైరయిన తరువాత రోజూ సాయంత్రాలు

## ఇదో అట్రాక్షన్

తండ్రీ కొడుకులతో స్టెప్పులేసిన హీరోయిన్లు మనకు చాలామందే వున్నారు. అలాంటి లిస్టులోకి అనుష్క కూడా చేరిందిప్పుడు. నాగార్జునతో కలిసి నటించిన అనుష్క నాగ్ కొడుకు నాగచైతన్యతో కూడా స్టెప్పులేస్తోందిట. నాగచైతన్య నటిస్తున్న చిత్రంలో ఓ ఐటమ్ నంబర్ చేస్తోందిట అనుష్క. ఈ పాటని మమతా మోహన్‌దాస్ పాడుతోందిట. 'అరుంధతి'తో సరికొత్త క్రేజ్ సొంతం చేసుకున్న అనుష్క చేసిన ఐటమ్ నంబరంటే క్రేజే మరి!




రామకృష్ణమఠంకి వెళ్లి అక్కడ ఉపన్యాసాలు విని రావడం అలవాటు చేసుకున్నాడు.

డబ్బు ఖర్చు, రాబడి, లెక్కలు వంటివి పూర్తిగా భార్యకే వదిలేశాడు.

రెండో అమ్మాయి శర్మిష్ఠ పెళ్లి అయిపోగానే ఆస్తి పంపకాలు చేసేశాడు. ముగ్గురి పిల్లలకు, భార్యకు నాలుగు భాగాలు చేసి రాసేశాడు. తన పేరిట తన పెన్షను తప్ప మరేమీ పెట్టుకోలేదు.

"నా పేరిట ఆస్తి రాయడం ఎందుకూ? నేనున్నన్నాళ్లు తిండి పెట్టి, ముత్తయిదువగా సాగనంపండి చాలు" అంది దాక్షాయణి అడ్డుపడి.

"నేను ఉన్నా లేకున్నా నీకు ఏ లోటు కలుగకుండా చూసే బాధ్యత నాది. అందుకే ఈ ఏర్పాటు" అన్నాడు పశుపతి. మాట్లాడకుండా ఊరుకున్నది దాక్షాయణి.

ఇక భర్తతో వాదించి ప్రయోజనం లేదని కొడుకు ఫోను చేసినప్పుడు అతని పెళ్లి విషయం ఎత్తింది దాక్షాయణి.

"మీ నాన్నగారు నీకెలాటి అమ్మాయి కావాలో అడగమన్నారు. ఈసారి నువ్వు వచ్చేసరికి నాలుగైదు సంబంధాలు చూసి ఉంచుతాం. నీకు నచ్చిన పిల్లని చేసుకుని వెంట తీసుకుపోవచ్చు" అన్నదావిడ.

"నా కోసం సంబంధాలు చూసే అవసరం లేదమ్మా. ఇక్కడ నాతో బాటు పనిచేస్తున్న కేరళ అమ్మాయిని ప్రేమించాను. ఆ అమ్మాయినే పెళ్లి చేసుకుంటాను. ఈ విషయంలో ఇక చర్చలు, వాదోపవాదాలు ఏమీ లేవు. వచ్చే నెలలో మేమిద్దరం సెలవు పెట్టి వస్తాం. మీ చేతుల మీద పెళ్లి చేసి పంపండి" అన్నాడు సురేష్.

దాక్షాయణికి గుండె దడదడలాడింది. ఆవిడకు కలిగిన ఆశాభంగం మాట అటుంచి, భర్త ఏ విధంగా స్పందిస్తాడో అని భయపడింది.

కానీ చిత్రంగా పశుపతి ఆవేశపడలేదు. వైరాగ్యంతో కూడిన నవ్వు అతని పెదాల మీద నర్తించింది.

"మంచిది. వాడిష్ట ప్రకారమే చేద్దాం. నాకూ పని సులువయింది. కేరళ అమ్మాయి అంటున్నాడు. కులం, మతం గురించి గొడవలు రాకుండా బ్రహ్మసమాజంలో పెళ్లి జరిపిద్దాం నిరాడంబరంగా. నీకూ తరువాతి ఆటుపోట్లు తట్టుకునే శక్తి ఉంటుంది" అన్నాడు.

సురేష్-శోభన పెళ్లికి నాలుగు రోజుల ముందు వచ్చారు. తమ స్నేహితుల ఇంట్లో పిల్లను దింపాడు సురేష్.

పెళ్లి ముందు రోజు రాత్రి పశుపతికి ఉధృతంగా గుండెపోటు వచ్చింది. ఆఘమేఘాల మీద నర్సింగ్ హోంలో చేర్పించారు.

ఐ.సి.యు.లో ఉన్న పశుపతిని చూడడానికి వచ్చిన అతని స్నేహితుడు దాక్షాయణితో అన్నాడు. "ఆరేళ్ల క్రిందట చెన్నై వెళ్లినప్పుడు నాడీ జోస్యం చెప్పించుకున్నాడు. పశుపతికి సంబంధించిన ప్రతి ఒక్క విషయం సరిగ్గా చెప్పారు వాళ్లు. తల్లిదండ్రులు, పుట్టిన తేదీ, ఊరు, భార్య, పిల్లలు, అక్క చెల్లెళ్లు, అన్నదమ్ములు, ఇంట్లో జరిగిన చావుపుట్టుకలు అన్నీ తు.చ. తప్పకుండా జరిగినవి జరిగినట్టు చెప్పారు. అప్పుడే పశుపతికి చెప్పారు వాళ్లు ఉన్న ఒక్క కొడుకు పెళ్లి చూసే యోగం లేదని. అలాగే జరుగుతూంది" అంటూ కళ్ల నీళ్లు పెట్టుకున్నాడు.

"వాడి పెళ్లి ఆపకు. నాకేం జరిగినా శుభకార్యం వాయిదా వేయకు. పాపం నా మూలాన ఇప్పటికే వాడి పెళ్లి ఆలస్యం చేశాను. ఆడపిల్లల బాధ్యత నీ మీద ఉండకూడదని అలా చేశాను" తన చేయి పట్టుకుని కళ్లనీళ్లు పెట్టుకుంటున్న భార్యతో చెప్పాడు పశుపతి.

మర్నాడు తెల్లవారుజామున అతడు ఆఖరి శ్వాస తీసుకున్నాడు.

తండ్రి స్నేహితుడి ద్వారా నాడీ జ్యోతిష్యం గురించిన వివరాలు విన్న సురేష్ నిర్ఘాంతపోయాడు.

"వాళ్ల మాటలకు నీదైన అర్థం తీసుకుని ప్రాణం తీసుకున్నావు కదా నాన్నా.. నిజానికి నాకు, శోభనకు ఆర్నెల్ల క్రితమే పెళ్లయింది. మీ తృప్తి కోసం ఇక్కడకు వచ్చి అక్షింతలు వేయించుకోవాలనుకున్నాం" అంటూ తండ్రి కాళ్ల మీద పడి దుఃఖించాడు.

☆



## రైటర్ ఇలియానా

ఎప్పటికైనా తనో మంచి కథ రాస్తానంటోంది ఇలియానా. ఏం కథ అంటారా? తనకి చిన్నప్పటి నుంచీ పుస్తకాలు చదవడం బాగా ఇష్టం. ఇలా చదవడం వల్ల తను కూడా ఏదయినా మంచి కథ రాయగలదు అనే సాహసం ఆమెలో కలుగుతోందిట. వాళ్ల మమ్మీ పుస్తకాల పురుగుట. రకరకాల వ్యక్తిత్వాలుగల మనుషుల్ని స్టడీ చేసి ఓ మాంచి కథ తయారుచేసుకుని సినిమా తీయాలనేది ఇలియానా కోరికట. ఇంతకీ అది ఫీచర్ ఫిల్మా? లేక డాక్యుమెంటరీనా? లేదా ఏదయినా అవార్డు కోసం తీసే స్పెషల్ మూవీనా? ఏమో చూద్దాం!